సమీకృత మార్కెట్ నిర్మాణమెప్పుడో ?



ఎండలోనే కూరగాయలు విక్రయిస్తున్న విక్రయదారులు



కూల్చేసిన మార్కెట్‌యార్డు స్థలం

- ప్రత్యేక మార్కెట్ యార్డు లేక క్రయ విక్రయదారుల తిప్పలు
- పాతది కూల్చి.. కొత్తది మరిచారు
- రోడ్డుపైనే కూరగాయల విక్రయం

గంభీరావుపేట: మండలకేంద్రంలో రోజువారీ కూరగాయల సంతలో క్రయ విక్రయదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గంభీరావుపేట, నర్మాల, దేశాయిపేట, ముస్తఫానగర్, పొన్నాలపల్లె, జిల్లెల్లపల్లె, దమ్మన్నపేట, నాగంపేట, లింగన్నపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, ఇతర నిత్యావసరాల కోసం ఇక్కడి మార్కెట్‌కు నిత్యం వస్తుంటారు. ఎండాకాలంలో ఎండకు, వానాకాలంలో వర్షంలో తడుస్తూ కూరగాయల విక్రయాలు జరుపుతుంటారు. ప్రత్యేక మార్కెట్ యార్డు లేకపోవడంతో రోడ్డుపైనే మార్కెట్ కొనసాగుతోంది. దీంతో ఉదయం పూట ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. విక్రయదారులు తాత్కాలికంగా నీడ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎండ వేడిమికి ఇటు కొనుగోలుదారులు, అటు విక్రయదారులు తల్లడిల్లిపోతున్నారు. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు తాగునీరు లేక దాహంతో అల్లాడిపోతున్నారు. ఏటా రూ.లక్షల్లో తైబజార్ ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతున్నా.. మార్కెట్ అభివృద్ధి జరగడం లేదు. బస్టాండ్‌లో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను వాడుకుంటున్నారు. మార్కెట్‌లో ప్రత్యేక టాయిలెట్స్‌గాని, తాగునీటి సౌకర్యాలుగాని లేవు. రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు మార్కెట్ కొనసాగుతోంది. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు, సీజన్‌లో లభించే పండ్లు వంటివి మార్కెట్‌లో లభ్యమవుతుంటాయి. దీంతో నిత్యం వందలాది మంది మార్కెట్‌కు వస్తుంటారు.

పాతది కూల్చారు.. కొత్తది మరిచారు..

రూ. లక్షలాది రూపాయలతో కొత్తగా సమీకృత మార్కెట్ యార్డు నిర్మిస్తామని గత గ్రామపంచాయతీ పాలకవర్గం గతంలో నిర్మించిన షెడ్లను, పాత గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని కూల్చేశారు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన సందర్భంగా వచ్చిన నగదు ప్రోత్సాహంతో కొత్తగా ఆధునిక హంగులతో సమీకృత మార్కెట్ నిర్మిస్తామన్నారు. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ చేతుల మీదుగా సమీకృత మార్కెట్ కోసం భూమిపూజ చేశారు. ఇంతలో ఎన్నికలు రాగా అటు ప్రభుత్వం మారింది.. ఇటు గ్రామపంచాయతీ పాలకవర్గ పదవికాలం ముగిసిపోయింది. కానీ మార్కెట్ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నాగారంలో మంగళవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే చెప్పకూడదని, ఖాతానుంచి డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ వస్తే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. యువకులు గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో 100 నెంబర్‌కు డయల్ సహాయం పొందవచ్చన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలరన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు



కోర్టుకు హాజరైన నాయకులు

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో 2015లో ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నాటి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, నాయకులు తిరుపతిరెడ్డి, పర్ష హనుమాండ్లు, దొమ్మాటి నరసయ్య, హమీద్, దీటి నర్సింలు, బైతి నవీన్, మహేశ్‌రెడ్డిపై కేసు నమోదు కాగా మంగళవారం సిరిసిల్ల కోర్టులో హాజరయ్యారు.

క్యాన్సర్‌పై అవగాహన



వేములవాడ రూరల్ : అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తంగళ్లపల్లి: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తంగళపల్లిలోని గిరిజన డిగ్రీ కళాశాలలో కాన్యన్సర్‌పై అవగాహన కల్పించారు. సిరిసిల్ల ప్రభుత్వ వైద్యశాల అసోసియేట్ ప్రొఫెసర్ బీ రామ్మోహన్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్ష చేసుకోవాలన్నారు. సమతుల ఆహారం, మంచి జీవన శైలి అలవర్చుకోవడం ద్వారా క్యాన్సర్‌బారిన పడకుండా ఉండవచ్చన్నారు. సైకాలజిస్ట్ కే పూర్ణ చందర్, హెల్పింగ్ హార్ట్స్ ప్రధాన కార్యదర్శి దాసరి తిరుమల, కళాశాల పిన్సిపల్ జీ జయ, వైస్ ప్రిన్సిపాల్ రెహాన, ప్రియాంక, వాణిశ్రీ, వనజ, శైలజ, శ్రీలక్ష్మి, మంజుల, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వేములవాడ మండలంలోని హన్మాజీపేట పీహెచ్‌సీ, వేములవాడలోని శాత్రాజుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, చీర్లవంచ, వేములవాడ పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి రజిత ఆస్పత్రిని తనిఖీ చేసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవాలని, క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. డిగ్రీ కళాశాలలో డా.దీప్తి పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, సుమలత, అనూష, వైద్యులు దివ్యశ్రీ, శరణ్య, సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న జనార్దన్ రెడ్డి

తంగళ్లపల్లి: జిల్లా ఎస్‌హెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నర్సింహులపల్లికి చెందిన బొంగరం జనార్దన్ రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య తెలిపారు. ఈ మేరకు జనార్దన్ రెడ్డికి హైదరాబాద్‌లో నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు



చందుర్తి : ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

చందుర్తి: రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల రెడ్డి సంఘం సభ్యులు చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ రెడ్డి సంఘం నాయకులు దూది శ్రీనివాస్‌రెడ్డి, పూడూరి ప్రశాంత్‌రెడ్డి, నలుమాచు భూంరెడ్డి, పూడూరి జీవన్ రెడ్డి, రాంరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, తిరుమల్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పన్యాల రాఘురాంరెడ్డి, బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, తదితరులున్నారు.

బోయినపల్లి: రెడ్డి సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల రెడ్డి సంఘం నాయకులు మంగళవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల రెడ్డి సంఘం నాయకులు గోగూరి అనంతరెడ్డి, గుడి రవీందర్ రెడ్డి, గుడి శ్రీనివాసరెడ్డి, పాశం నారాయణరెడ్డి, మిట్టపెల్లి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

తంగళ్లపల్లి: రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శాసన మండలి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని గోపాల్‌రావుపల్లి రెడ్డి సంఘం నాయకులు అన్నారు. తంగళ్లపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రామ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే మల్లన్న రెడ్డి సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. ఇక్కడ ఆసిరెడ్డి రాం రెడ్డి, పూర్మాని కరుణాకర్ రెడ్డి, బంద్రపు రాజి రెడ్డి, కూతురి రాజి రెడ్డి, బంద్రపు బాపు రెడ్డి, కడారి సునీల్ రెడ్డి, మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ శాఖ అధికారి సాయికిరణ్ ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాత్రాజుపల్లి పరిధిలోని పలు ప్రాంతాలలోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో మొగిపురుగు, అగ్గి తెగులు, జింక్ పోషక లోపం ఉన్నట్లు తెలిపారు. వీటి నివారణకు కార్తప్ హైడ్రో క్లోరైడ్ గుళికలు, క్లోరాంత్రనిలిప్రోలీన్ పిచికారీ చేయాలన్నారు. పంటలపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **మహిళల భద్రతకు భరోసా**

సిరిసిల్లక్రైం: జిల్లాలోని విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాల్లో షీటీం, పోలీసు అక్క విస్తృత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నెల వ్యవధిలో మహిళలను వేధిస్తున్న వారిపై మూడు కేసులు, 8 పెట్టి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వేధింపులకు గురైతే షీ టీం 87126 56425, పోలీస్ అక్కకు ఫిర్యాదు చేయాలన్నారు.

● **సన్మానం**

సిరిసిల్లటౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిరిసిల్ల మున్సిపల్ సమ్మయ్యను మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, కుడిక్యాల రవి, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు చిన్నమనేని కమలాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు గుల్లపల్లి గౌతమ్, తదితరులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

● **సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి**

సిరిసిల్ల క్రైం : సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులకు ఖాకీ కిడ్స్ కార్యక్రమంపై పోలీస్‌స్టేషన్ సైబర్ వారియార్ జె. వెంకటరమణ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

● **నూతన కార్యవర్గం**

వీర్నపల్లి: ఆర్ఎంపీ, పీఎంపీ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్యా సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా మనీపాల రవి, క్యాషియర్‌గా బోయిని నర్సయ్య, ఉపాధ్యక్షులుగా పసుల గంగరాజు, కార్యవర్గ సభ్యులుగా బంజార రాజేశం, గుమ్మడి రాజేశం, నక్క పర్శరాములు, గంగ మురళి, రాజు, సురేశ్, మహిపాల్, సుధీర్, ప్రకాశ్, దర్ సింగ్, కాశిం, మురళి, దేవదాస్, రాజేశం ఎన్నికయ్యారు.

● **గుట్టను చదును చేస్తున్న వ్యక్తిపై కేసు**

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 17లోని కుమ్మరిగుట్ట వద్ద జేసీబీలతో చదును చేస్తున్న కోనరావుపేటకు చెందిన ఆముద రాజుపై కేసు నమోదు చేసి రెండు జేసీబీలు సీజ్ చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రానికి చెందిన రాజు శివంగాలపల్లిలోని కుమ్మరి గుట్టపై తనకు పట్టా ఉందని చెబుతూ వాల్టా చట్టానికి విరుద్ధంగా రెండు జేసీబీలు, ఒక హిటాచీ వాహనాలతో గుట్టను చదును చేస్తున్నాడు. ఆముద రాజుపై పోలీసులు కేసు నమోదు చేసి రెండు జేసీబీలను సీజ్ చేశారు. మరో హిటాచీ వాహనాన్ని తరలించలేక అక్కడే వదిలేశారు.

సర్వేపేరుతో మోసం



ముస్తాబాద్: సర్వే పేరుతో బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం స్వామి ఆరోపించారు. ముస్తాబాద్ పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సర్వేకు వ్యతిరేకంగా బీసీల సంఖ్యను తగ్గించి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పెంచుకునేందుకే బీసీల జనాభాను, కుటుంబాలను తక్కువ చేసి చూపారన్నారు. మరోసారి దీనిపై కమిటీ వేసి విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు బిక్షపతి, దేవయ్య, స్వామి, రాంప్రసాద్, దేవరాజు, నర్సింలు, శ్రీనివాస్, శంకర్, రాజేశ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వేను రద్దుచేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం హరీశ్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మరో ప్రజా ఉద్యమానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉండాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీతో కలిసి త్వరలోనే ఐక్య కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు.



చందుర్తి: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయం సమీపంలో మంచినీటి గేట్‌వాల్స్ లీకేజీతో కలుషిత నీరు పైపులైన్‌లోకి వెళ్లి, నల్లాల ద్వారా కలుషిత నీరు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా అధికారులు పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించినా కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీనివాస్‌రెడ్డి
పంచాయతీ కార్యదర్శి, చందుర్తి, సెల్ నెం: 9676989692

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

డిగ్రీ కళాశాల మంజూరు చేయండి



జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేసి ఉన్నత విద్యకు సహకరించాలని ఇంటర్ విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట, హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లలేక డిగ్రీ విద్యకు దూరమవుతున్నామని బాలికలు పేర్కొన్నారు. కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య, పల్లె సత్యం పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



కోనరావుపేట : మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: జిల్లాకేంద్రంలో బుధవారం జరిగే ఎస్ఎఫ్ఐ నాలుగో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రాహుల్, కార్యదర్శి పిట్టల రాకేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిబ్రవరి 5,6 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: ఎస్ఎఫ్ఐ నాలుగో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వినయ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



ఇల్లంతకుంట : సమావేశమైన ఎంపీడీవో

బోయినపల్లి: మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఎంపీడీవో బీమ జయశీల మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టు ప్రచురణ విషయంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఎడపల్లి పరశురామ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, నాయకులు ఉదారి నర్సింహాచారి, గుడి రవీందర్‌రెడ్డి, ఎండీ. బాబు, మెరుపుల మహేశ్, అమ్మిగల్ల గోపాల్ తదితరులు ఉన్నారు.

చందుర్తి : చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఓటరు లిస్టులను ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, బీజేపీ పార్టీ నుంచి జిల్లా కమిటీ సభ్యులు పోంచెట్టి రాకేశ్, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి దుమ్ము అంజయ్య పాల్గొన్నారు. పంచాయతీ రాజ్‌ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సిబ్బంది ఉన్నారు.

ముస్తాబాద్: మండల పరిషత్‌లో అఖిల పక్షం సమావేశాన్ని ఎంపీడీవో బీరయ్య నిర్వహించారు. ఓటరు జాబితాను సిద్ధం చేశామని, ఇప్పటికే అభ్యంతరాలు స్వీకరించామన్నారు. మార్పులు చేర్పులు, సవరణలు, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారి పేర్ల నమోదు చేశామన్నారు. ఇప్పటికే ఒక సాధారణ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులకు పూర్తి వివరాలు తెలియజేశామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, గీస భిక్షపతి, ముక్క మల్లయ్య, శీలం స్వామి, కిషన్‌రావు, సుద్దాల దేవయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో శశికళ సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాపై చర్చించారు. సమావేశంలో సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నరసయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు అమర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా సుందరయ్యనగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఫ్లెక్సీని చింపిన దుండగులపై భక్తులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమాన్ ఆలయం పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చింపారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ పరిసరాల్లో చాలామంది మందుబాబులు రాత్రి 2 గంటల వరకు సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఆలయానికి రక్షణ లేకుండా పోయిందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

చెరువు కబ్జాపై విచారణ చేపట్టాలి

ముస్తాబాద్: మండలంలోని వీర సముద్రం చెరువు కట్టభూమి కబ్జా విషయంలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని రైతు పర్శరాములు నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. అక్కడ తనకు ఎలాంటి భూములు లేవన్నారు. చెరువుకు గండి పడినప్పుడు రైతులు దారికోసం చదును చేసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎండీ.బఫత్ ఖాజా



ఎండీ ఆజీద్ మేరాజ్

బోయినపల్లి/చందుర్తి: ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 4 నుంచి 7 వరకు జరిగే 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన ఎండీ బఫత్ ఖాజా ఎంపికయ్యాడు. అలాగే చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన ఎండీ ఆజీద్ మేరాజ్ ఎంపికైనట్లు తాజా మాజీ సర్పంచ్ లింగంపల్లి కరుణాకర్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో హోమం



ఇల్లంతకుంట: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయం వద్ద మంగళవారం గణపతి హోమం కార్యక్రమాలను రెండోరోజు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామికి మహాపడిపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పూజా కార్యక్రమాలు చేశారు. ఇల్లంతకుంట వైశ్యసంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ అందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట: వెంకట్రావుపేటలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ మంతెన సంతోష్‌రెడ్డి, మంతెన మల్లేశం (వినాయక బోర్‌వెల్) రూ. 1,01,016 విరాళంగా అందజేశారు. గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన సంతోష్‌రెడ్డి, మల్లేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



గంభీరావుపేట: మండలకేంద్రంలో రెడ్డిసేవా సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మహాంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. 5న గురువందనం, గణపతి పూజ, పుణ్యహవచనం, అగ్ని మధనం, అఖండ దీపస్థాపన, గణపతి హోమం, 6న ప్రధాన దేవత మూలమంత్ర హోమాలు, చండీహోమం, సామూహిక కుంకుమార్చన, 7న మహాంకాళి యంత్రమూర్తి స్థాపనం, మహాకుంభాభిషేకం, అన్నదానం, 8న అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సింగారం చెరువుకు నీటిని తరలించాలి



చెరువు వద్ద రైతుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం ఊర చెరువుకు ఎగువ మానేరు నీటిని తరలించాలని చెరువు కమిటీ చైర్మన్ గోస్కుల నారాయణ డిమాండ్ చేశారు. చెరువు వద్ద రైతులతో మంగళవారం ఆందోళన చేపట్టారు. చెరువు కింద ఆయకట్టు 300 ఎకరాలు ఉందని, అందరు రైతులు వరిపంట సాగు చేస్తున్నారన్నారు. చెరువులో నీరులేక రైతులు ఆందోళనకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మానేరు వాగులోకి నీరు వృథాగా పోతుందని, దానిని చెరువు కాలువలోకి మళ్లించాలని కోరారు. అధికారులు స్పందించి, చెరువు వస్తున్న కాలువ బుంగలు పూడ్చి, నీటిని తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చందుర్తి: మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్. అభినయ, ఫార్మస్ట్ సంధ్యారాణి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిశుభ్రత పాటిస్తూ పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేష్, ఏఎన్ఎం దివ్య , ఉపాధాయులు కోరెపు శ్రీనివాస్, మేకల పద్మ, చింతల హరిష్మా, ఏగోలపు మాధవి పాల్గొన్నారు.

కంది కట్కూర్‌లో ఫైలేరియా సర్వే

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్‌లో సోమవారం రాత్రి ఫైలేరియా యూనిట్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. 63 మందికి బ్లడ్ స్మెర్ పరీక్షలు నిర్వహించారు. మండలంలో దాదాపు 500 మందికి, కందికట్కూరులో 25 మందికి ఫైలేరియా ఉన్నట్లు సూపర్‌వైజర్ జవహర్ తెలిపారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.